16062025-DIS-13_Layout 1 6/16/2025 2:51 AM Page 1

రాబడి

ఒడిదొడుకుల్లోనే పయనం!

మార్కెట్ పల్స్

దేశీయ స్టాక్ మార్కెట్లు గత వారం మళ్లీ నష్టాల్లోకి జారుకున్నాయి. ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు, గ్లోబల్ మార్కెట్‌లో పెరుగుతున్న ముడి చమురు ధరలు.. భారతీయ స్టాక్ మార్కెట్లను ప్రభావితం చేస్తున్నాయి. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే గత వారం బీఎస్ఈ ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,070.39 పాయింట్లు కోల్పోయి 81,118.60 వద్ద నిలిచింది. ఇక ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ 284.45 పాయింట్లు పడిపోయి 24,718.60 దగ్గర ముగిసింది. దీంతో ఈ వారం కూడా పశ్చిమాసియా దేశాల్లోని పరిస్థితుల ప్రభావం స్థానిక ఈక్విటీలపై స్పష్టంగా ఉండవచ్చన్న అంచనాలైతే ఉన్నాయి. ఆయిల్-గ్యాస్ తదితర రంగాల షేర్ల కదలికలు కీలకమని చెప్పుకోవచ్చు. అయితే రెపోరేటు 50 బేసిస్ పాయింట్లు తగ్గిన నేపథ్యంలో రియల్టీ, ఆటో, బ్యాంకింగ్ రంగాల షేర్లకు గిరాకీ ఉండవచ్చన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఇదిలావుంటే ఎప్పట్లాగే డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ, గ్లోబల్ స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులు, విదేశీ సంస్థాగత మదుపరుల (ఎఫ్ఐఐ) పెట్టుబడులు, దేశీయ మార్కెట్లను నిర్దేశించనున్నాయి. ఇక అమ్మకాల ఒత్తిడి కనిపిస్తే నిఫ్టీకి 24,500 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 24,300 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. కానీ సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 25,000-25,200 స్థాయికి వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

గమనిక..: స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు బ్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదొడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.

ఎఫ్‌డీ రేట్లు తగ్గాయ్

సంప్రదాయ డిపాజిటర్లకు నిపుణుల సూచనలేంటి?



ఈ ఏడాది మొదలు ఇప్పటిదాకా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ప్రతీ ద్రవ్య సమీక్షలోనూ వడ్డీరేట్లను తగ్గిస్తూనే ఉన్నది. గత మూడు ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షల్లో రెపో రేటును 100 బేసిస్ పాయింట్లు (1 శాతం) తగ్గించింది. ఇటీవలి ద్రవ్యసమీక్షలోనైతే ఒకేసారి 50 బేసిస్ పాయింట్లు (అర శాతం) కోత పెట్టింది. దీంతో బ్యాంకులూ రుణాలపై వడ్డీరేట్లను తగ్గించేస్తున్నాయి. పైగా తాజా ద్రవ్యసమీక్షలో నగదు నిల్వల నిష్పత్తి (సీఆర్ఆర్)ని 1 శాతం తగ్గిస్తున్నట్లు ఆర్బీఐ ప్రకటించింది. ఈ నిర్ణయం బ్యాంకింగ్ వ్యవస్థలోకి అదనంగా రూ.2.5 లక్షల కోట్ల నిధులు వచ్చేలా చేస్తున్నది. ఫలితంగా ఇప్పుడు బ్యాంకులకు నగదు కొరతనే లేకుండా పోతున్నది. దాంతో ఫిక్స్‌డ్ డిపాజిట్ల (ఎఫ్‌డీ)కు అధిక వడ్డీరేట్లు ఇవ్వాల్సిన పరిస్థితి బ్యాంకులకు లేదనే చెప్పొచ్చు. అటుఇటుగా అన్ని బ్యాంకులూ తమ ఎఫ్‌డీలపై వడ్డీరేట్లను సవరిస్తూపోతున్నాయిప్పుడు. ఇప్పటికే ఎఫ్‌డీలపై వడ్డీరేట్లు 30-70 బేసిస్ పాయింట్లు తగ్గాయని ఎస్బీఐ రిసెర్చ్ నివేదిక చెప్తున్నది.

ఇదీ సంగతి..



ఫిక్స్‌డ్ డిపాజిట్ ఇన్వెస్టర్లు తమ రాబడులు వేగంగా తగ్గిపోతున్నాయన్నది గుర్తుంచుకోవాలి. రెపో రేటు 5.50 శాతానికి దిగింది. గత ఏడాది వరకు ఇది 6.50 శాతంగా ఉండేది. నిజానికి ద్రవ్యోల్బణం ఇప్పుడు ఆర్బీఐ ఆమోదయోగ్య స్థాయికి దిగువనే ఉన్నది. ఈ క్రమంలో జీడీపీ బలోపేతంపైనే ఆర్బీఐ దృష్టి పెడుతుందన్నది ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. దీంతో రాబోయే ద్రవ్యసమీక్షల్లోనూ రెపో రేటు మరింతగా తగ్గే వీలు లేకపోలేదు. ఇదే జరిగితే ఎఫ్‌డీలపై పెట్టుబడులు నిరర్థకమే. ముఖ్యంగా సంప్రదాయ ఇన్వెస్టర్లు, సురక్షిత పెట్టుబడులను ఆశించే సీనియర్ సిటిజన్లకు ఇది ఇబ్బందికరమే. సేవింగ్స్ అకౌంట్లపైనా వడ్డీరేట్లు 2.7 శాతానికి దిగజారిపోయాయి. ఈ నేపథ్యంలో ఎఫ్‌డీలపైనా ఇంచుమించుగా ఇదే స్థాయిలో వడ్డీరేట్లు స్థిరపడే అవకాశాలున్నాయి. మరి నిపుణులు ఏం చెప్తున్నారు.

ఇప్పుడే త్వరపడాలి

కొన్ని చిన్న ఫైనాన్స్ బ్యాంకులు ఇప్పటికీ ఎఫ్‌డీలపై 8 శాతం, అంతకన్నా ఎక్కువ వడ్డీరేటును ఆఫర్ చేస్తున్నాయి. దీర్ఘకాలిక పెట్టుబడులకు దిగివారు ఈ బ్యాంకుల్లో తమ నగదును డిపాజిట్ చేసుకోవచ్చు. అయితే డిపాజిట్ ఇన్సూరెన్స్ అండ్ క్రెడిట్ గ్యారంటీ కార్పొరేషన్ (డీఐసీజీసీ) రూ.5 లక్షల కవరేజీకి అనుగుణంగా మీ ఎఫ్‌డీలు ఉండేలా చూసుకోవాలి. అధిక వడ్డీరేట్లకు ఆశపడి ఎక్కువ మొత్తంలో డిపాజిట్లు చేస్తే సదరు బ్యాంకులు ఒకవేళ బోర్డు తిప్పేస్తే రిస్కులో పడుతారు. కనుక అన్నిరకాలుగా ఆలోచించి తగు నిర్ణయం తీసుకోవడం వివేకం. సీనియర్ సిటిజన్ల పేరిట ఎఫ్‌డీలు చేసినా అధిక వడ్డీరేట్లను పొందవచ్చు. ఆయా బ్యాంకులిస్తున్న స్పెషల్ ఎఫ్‌డీలనూ పరిశీలించండి.

చిన్న చిన్న ఎఫ్‌డీలుగా

డిపాజిటర్లు తమ దగ్గర పెద్ద ఎత్తున నగదు నిల్వలుంటే వాటిని చిన్న చిన్న ఎఫ్‌డీలుగా మదుపు చేయడం తెలివైన పని. సింగిల్ డిపాజిట్ల కంటే మల్టీపుల్ డిపాజిట్లు ఎంచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. అలాగే ఒకే టెన్యూర్‌పై కాకుండా రకరకాల టెన్యూర్స్‌లో వీటిని డిపాజిట్ చేయడం వల్ల మన అవసరాలకు అనుగుణంగా తిరిగి పొందవచ్చు. లేకపోతే ముందస్తు విత్‌డ్రాలతో జరిమానాలు పడి వడ్డీ లాభాలను కోల్పోవాల్సి వస్తుంది.

లాంగ్ టర్మ్

చిన్న మొత్తాలను దీర్ఘకాలిక వ్యవధులకు ఫిక్స్‌డ్ చేసుకుంటే లాభదాయకం. 2-3 ఏండ్ల టెన్యూర్‌కు బదులుగా, అంతకంటే ఎక్కువ టెన్యూర్‌ను ఎంచుకొంటే వడ్డీరేట్ల హెచ్చుతగ్గుల నుంచి లబ్ధి పొందవచ్చు.

ఈ బ్యాంకుల క్రెడిట్ కార్డు చార్జీలు మారుతున్నాయ్..

ప్రైవేట్ బ్యాంకింగ్ సంస్థలు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్‌లు క్రెడిట్ కార్డులపై చార్జీలను సవరిస్తున్నాయి. కార్డ్ యూసేజ్, బ్యాంకింగ్ సర్వీసెస్ చార్జీలు వచ్చే నెల జూలై 1 నుంచి మారుతాయని ఆయా బ్యాంకులు అధికారికంగా ప్రకటించాయి.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్

- **ఆన్‌లైన్ గేమింగ్**

డ్రీమ్11, రమ్మీ కల్చర్, జంగ్లీ గేమ్స్ లేదా ఎంపీఎల్ వంటి ఆన్‌లైన్ నైపుణ్య ఆధారిత గేమింగ్ వేదికలపై నెలకు రూ.10 వేలకు మించి క్రెడిట్ కార్డు యూజర్లు వెచ్చిస్తే మొత్తం నెలవారీ ఖర్చుపై 1 శాతం ఫీజు పడుతుంది. అయినప్పటికీ ఒక నెలకుగాను ఈ చార్జీకి గరిష్ఠ పరిమితి రూ.4,999. అలాగే ఈ గేమింగ్ లావాదేవీలకు ఎటువంటి రివార్డ్ పాయింట్లూ ఉండవు.

- **డిజిటల్ వ్యాలెట్**

పేటీఎం, మొబిక్విక్, ఫ్రీచార్జ్ లేదా ఓలా మనీ వంటి థర్డ్‌పార్టీ వ్యాలెట్లలోకి నెలలో రూ.10 వేలకు మించి క్రెడిట్ కార్డు వినియోగదారులు పంపితే ఆ మొత్తంపై నెలకు రూ.4,999 దాటకుండా 1 శాతం చార్జీ వర్తిస్తుంది.

- **యుటిలిటీ బిల్ చెల్లింపులు**

క్రెడిట్ కార్డుల ద్వారా యుటిలిటీ బిల్లుల చెల్లింపులు నెలకు రూ.50,000 దాటితే రూ.4,999 మించకుండా 1 శాతం చార్జీ పడుతుంది. అయితే బీమా పాలసీ చెల్లింపులను యుటిలిటీ బిల్ పేమెంట్స్‌గా పరిగణించబోమని బ్యాంక్ తెలిపింది. కాబట్టి వీటికి ఈ చార్జీలు వర్తించవు.

- **వీటికి గరిష్ఠ చార్జీలు**

అద్దె, ఇంధనం, చదువుల ఫీజులకు క్రెడిట్ కార్డులను వినియోగిస్తే ఒక్కో లావాదేవీకి గరిష్ఠంగా రూ.4,999 చార్జీ పడనున్నది. పైగా అద్దె చెల్లింపులపై ఇప్పుడున్న 1 శాతం ఫీజు కూడా మారదు. ఇక ఇంధన లావాదేవీలు రూ.15,000 దాటితే 1 శాతం ఫీజు ఉంటుంది. అయితే కళాశాల, పాఠశాల అధికారిక వెబ్‌సైట్ల ద్వారా లేదా వారి కార్డ్ మెషీన్లపై నేరుగా చేసే చెల్లింపులకు చార్జీలు పడవు.

ఐసీఐసీఐ బ్యాంక్

- **నగదు, చెక్, డీడీ, పీవో**

నగదు, చెక్కులు, డీడీలు, పీవో లావాదేవీలకు కష్టమర్లు క్రెడిట్ కార్డులను వాడితే రూ.1,000కి రూ.2 చొప్పున కనీసం రూ.50, గరిష్ఠంగా రూ.15,000 చార్జీలుంటాయి. ప్రస్తుతం రూ.10 వేలదాకా రూ.50, రూ.1,000 దాటితే రూ.5 చార్జీగా బ్యాంక్ వసూలు చేస్తున్నది.

- **ఏటీఎం వినియోగం**

ఏటీఎం వినియోగ చార్జీలూ పెరుగుతున్నాయి. ఇతర బ్యాంక్ ఏటీఎంల్లో ఐసీఐసీఐ బ్యాంక్ కష్టమర్లు నెలకు మూడుసార్లు ఉచితంగా లావాదేవీలు చేసుకోవచ్చు. ఇది దాటితే ఒక్కో ఆర్థిక లావాదేవీకి రూ.23 (ప్రస్తుతం రూ.21) చొప్పున, ఆర్థికేతర లావాదేవీకి రూ.8.5 చొప్పున చార్జీ ఉంటుంది. ఇక ఐసీఐసీఐ బ్యాంక్ ఏటీఎంల్లో ఆ బ్యాంక్‌కు చెందిన రెగ్యులర్ సేవింగ్స్ ఖాతాదారులు నెలకు 5 ఆర్థిక లావాదేవీలు దాటితే ఒక్కో దానికి రూ.23 (ప్రస్తుతం రూ.21) చొప్పున చార్జీని చెల్లించాల్సి ఉంటుంది.

- **డెబిట్ కార్డు ఫీజులు**

ఐసీఐసీఐ బ్యాంక్ డెబిట్ కార్డులకు వార్షిక చార్జీ రూ.200 నుంచి రూ.300కు పెరిగింది. కార్డు పోతే కొత్త కార్డు రావాలన్నా తీసుకునే చార్జీ రూ.200 నుంచి రూ.300కు పెంచారు.

ఐదు ఎన్ఎఫ్ఓ సబ్‌స్క్రిప్షన్లు

ఐదు మ్యూచువల్ ఫండ్ ఎన్ఎఫ్ఓలు సబ్‌స్క్రిప్షన్‌కు వచ్చాయిప్పుడు. మ్యూచువల్ ఫండ్ కంపెనీలు తెచ్చిన ఆ న్యూ ఫండ్ ఆఫర్స్ (ఎన్ఎఫ్ఓ)ను పరిశీలిస్తే.. వాటిలో నాలుగు ఇండెక్స్ ఫండ్లు, ఒక లార్జ్ అండ్ మిడ్‌క్యాప్ ఫండ్ ఉన్నాయి. మ్యూచువల్ ఫండ్ యూనిట్లను వాటి నికర ఆస్తి విలువ (ఎన్ఏవీ) నిర్ణయానికి ముందే మదుపరులు చేజిక్కించుకొనేందుకు ఎన్ఎఫ్ఓలు వీలు కల్పిస్తాయి. తద్వారా ఇన్వెస్టర్లు దీర్ఘకాలంలో లాభాలను ఒడిసి పట్టుకునేందుకు అవకాశం ఉంటుంది. ఇక సదరు మ్యూచువల్ ఫండ్ మొదలైతే సంబంధిత నికర ఆస్తి విలువను చెల్లించి ఇన్వెస్టర్లు తమ యూనిట్లను సొంతం చేసుకోవచ్చు.

ఇండెక్స్ ఫండ్లు

డీఎస్‌పీ నిఫ్టీ హెల్త్‌కేర్ ఇండెక్స్ ఫండ్, డీఎస్‌పీ నిఫ్టీ ఐటీ ఇండెక్స్ ఫండ్, టాటా నిఫ్టీ మిడ్‌క్యాప్ 150 ఇండెక్స్ ఫండ్‌ల సబ్‌స్క్రిప్షన్ గడువు జూన్ 16న ముగుస్తున్నది. మోతీలాల్ ఓస్వాల్ బీఎస్ఈ 1000 ఇండెక్స్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ గడువు జూన్ 19 వరకు ఉన్నది.

లార్జ్ అండ్ మిడ్‌క్యాప్ ఫండ్

సొమ్మో లార్జ్ అండ్ మిడ్‌క్యాప్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ జూన్ 19తో ముగుస్తున్నది. అయితే గ్రో నిఫ్టీ 500 లో వొలటాలిటీ 50 ఎక్స్చేంజ్ ట్రేడెడ్ ఫండ్ (ఈటీఎఫ్), నిప్పాన్ ఇండియా ఇన్‌కమ్ ప్లస్ ఆర్బిట్రేజ్ యాక్టివ్ ఫండ్ ఆఫ్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్‌ల గడువు జూన్ 11నే అయిపోయింది.

మోహన్‌లాల్‌తో నటించాలని ఉంది

'మోహన్‌లాల్‌తో ప్రియదర్శిన్ తీసిన 'చిత్రం' సినిమాని తెలుగులో 'అల్లుడుగారు'గా రీమేక్ చేసి, జీరో నుంచి స్టార్ హీరోగా మారాను. అప్పట్నుంచి నాకూ, మోహన్‌లాల్‌కూ బంధం ఏర్పడింది. మోహన్‌లాల్ అప్పుడెలా ఉన్నారో, మానసికంగా శారీరకంగా ఇప్పుడూ అలాగే ఉన్నారు. స్వచ్ఛమైన మనసు ఉన్నవారే అలా ఉండగలరు. క్రమశిక్షణ గల నటుడాయన. ఒక్క రూపాయి తీసుకోకుండా మా 'కన్నప్ప'లో నటించారు మోహన్‌లాల్. ఆయన చూపించిన ప్రేమను ఎప్పటికీ మరువలేను. మోహన్‌లాల్ అంతటి మహానటుడితో నటించే అవకాశం మా విష్ణుకు వచ్చినందుకు సంతోషంగా ఉంది. మోహన్‌లాల్‌తో నాకూ నటించాలని ఉంది. అవకాశం ఇవ్వమని అడుగుతున్నా.' అని డా.మోహన్‌బాబు అన్నారు. మంచు విష్ణు కథానాయకుడిగా ఆయన నిర్మించిన భక్తిరసాత్మక చిత్రం 'కన్నప్ప'. ముఖేష్‌కుమార్ సింగ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఈ నెల 27న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా కేరళలోని కొచ్చీలో నిర్వహించిన ఈ సినిమా ట్రైలర్ రిలీజ్ ఈవెంట్‌లో మోహన్‌బాబు మాట్లాడారు. 'కన్నప్ప' సినిమాలో భాగమైనందుకు ఆనందంగా ఉందని, అన్ని భాషల నటీనటులు నటించిన ఈ చిత్రం పెద్ద విజయం సాధించాలని, గొప్ప శివభక్తుడైన కన్నప్ప కథను ఎంతో అద్భుతంగా దర్శకుడు తెరకెక్కించారని, శివానుగ్రహంతో ఈ సినిమా పెద్ద విజయం సాధించాలని మోహన్‌లాల్ ఆకాంక్షించారు. మోహన్‌లాల్‌తో స్క్రీన్ షేర్ చేసుకోవడం పూర్వజన్మ సుకృతమని, ఇందులో ఆయన పాత్ర సర్‌ప్రైజింగ్‌గా ఉంటుందని మంచు విష్ణు తెలిపారు. సినిమాను అందరూ ఇష్టంతో, ప్రేమతో తీస్తారని, మేం మాత్రం ఈ సినిమాను భక్తితో ఓ ప్రార్థనలా తీశామని దర్శకుడు ముఖేష్‌కుమార్‌సింగ్ చెప్పారు. ఇంకా అర్పిత్ రంకా, ముఖేష్‌రిషి, ఆంటోని పెరంబవూర్ కూడా మాట్లాడారు.

చిత్రం

భాగ్యనగరంలో అఘోరీ హంగామా



ప్రేక్షకులు ఎప్పుడెప్పుడా అని ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాల్లో నందమూరి బాలకృష్ణ 'అఖండ 2: తాండవం' ముందు వరుసలో ఉంటుంది. బోయపాటి శ్రీను అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని నిర్మాతలు రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట పాన్ ఇండియా స్థాయిలో నిర్మిస్తున్నారు. ఇటీవలే జార్జియాలో ఈ సినిమాకు సంబంధించిన యాక్షన్ సీన్స్‌ని షూట్ చేశారు. నేటి నుంచి హైదరాబాద్ ఆర్ఎఫ్‌సీలో ఈ సినిమాకు సంబంధించిన కొత్త షెడ్యూల్ మొదలుకానుంది. ఈ షెడ్యూల్‌లో బాలకృష్ణతోపాటు యూనిట్ అంతా పాల్గొంటారు. సినిమాలోని కీలకమైన సన్నివేశాలను ఈ షెడ్యూల్‌లో చిత్రీకరిస్తామని మేకర్స్ తెలిపారు. బాలయ్య పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన టీజర్‌కు ప్రపంచవ్యాప్తంగా అద్భుతమైన స్పందన వచ్చిందని, రికార్డ్ బ్రేకింగ్ వ్యూస్ వచ్చాయని, తొలి పార్ట్ 'అఖండ'ను మించేలా ఈ సీక్వెల్ ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. సంయుక్త మీనన్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో ఆది పినిశెట్టి ప్రతినాయకునిగా కనిపించనున్నారు. ఈ చిత్రానికి కెమెరా: సి.రామ్‌ప్రసాద్, సంగీతం: ఎస్.థమన్, సమర్పణ: ఎం.తేజస్వినీ నందమూరి, నిర్మాణం: 14 రీల్స్ ప్లస్.

సరస్వతిదేవి తల ఎత్తుకునేలా కుబేర

' 'కుబేర' పూర్తిగా శేఖర్ కమ్ముల ఫిల్మ్. మేమంతా పాత్రలం మాత్రమే. తన కంఫర్ట్ జోన్ నుంచి బయట కొచ్చి శేఖర్ చేసిన సినిమా ఇది. ఈ సినిమాతో మా ఆర్టిస్టులందరి ఆకలి తీర్చేశారు శేఖర్ కమ్ముల. సినిమా విజయంపై పూర్తి నమ్మకంతో ఉన్నాం.' అని అక్కినేని నాగార్జున అన్నారు. ఆయన ప్రత్యేక పాత్రలో ధనుష్ హీరోగా రూపొందిన పాన్ ఇండియా చిత్రం 'కుబేర'. రష్మిక మందన్నా కథానాయిక. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో సునీల్ నారంగ్, రామ్‌మోహన్ పుస్కూర్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 20న విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీరిలీజ్ ఈవెంట్‌లో నాగార్జున మాట్లాడారు. ఈ సినిమా కథ గురించి తెలిసి షాకయ్యానని, రిచ్ ప్రపంచాన్ని, పూర్ ప్రపంచాన్ని ఈ కథలో శేఖర్ ఎలా కలిపారో చూడాలని తానూ ఎదురుచూస్తున్నానని అతిథిగా విచ్చేసిన ఎస్.ఎస్.రాజమౌళి తెలిపారు. ధనుష్ మాట్లాడుతూ ' 'కుబేర' కోసం శేఖర్ కమ్ముల చాలా కష్టపడ్డారు. ఆరోగ్యాన్ని కూడా లెక్కచేయలేదు. ఆయనతో పని చేయడం ప్రౌడ్‌గా ఫీలవుతున్నా. 'సార్' తర్వాత నేను చేసిన తెలుగు సినిమా ఇది. నా కెరీర్‌కి 'కుబేర' నిజంగా స్పెషల్.' అని చెప్పారు. ''కుబేర' నాకు తల్లిలాంటి సినిమా. బిచ్చగాడైనా కోటీశ్వరుడైనా తల్లిప్రేమ ఒక్కటే. ఆ ఎమోషన్‌తోనే ఈ సినిమా తీశాను. దర్శకుడయ్యే ముందు సరస్వతీదేవి తలదించుకునేలా సినిమాలు చేయకూడదని ప్రామిస్ చేసుకున్నా. ఈ సినిమా సరస్వతి తల ఎత్తుకునేలా ఉంటుంది. నిజంగా కొత్త సినిమా. అన్ని ఎమోషన్స్ూ ఉన్న నిజమైన పాన్ ఇండియా సినిమా ఇది. మీరు డెఫినెట్‌గా గొప్ప సినిమా చూడబోతున్నారు.' అని శేఖర్ కమ్ముల నమ్మకం వెలిబుచ్చారు. ఇంకా కథానాయిక రష్మిక మందన్నాతోపాటు నిర్మాతలు సునీల్ నారంగ్, రామ్‌మోహన్ పుస్కూర్, తోట తరణి, దేవిశ్రీ ప్రసాద్, జాన్వీ నారంగ్ కూడా మాట్లాడారు.

అవార్డుల వేడుకలకు అందరూ రావాలి

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన గద్దర్ ఫిల్మ్ అవార్డుల స్వీకరణ విషయంలో సినీ పరిశ్రమ వ్యవహరించిన తీరుపై అగ్ర నిర్మాత, ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్‌రాజు అసంతృప్తి వ్యక్తం చేశారు. పరిశ్రమకు చెందిన కొందరు ఈ వేడుకకు హాజరు కాకపోవడం పట్ల ఆయన అసహనం వెలిబుచ్చారు. ప్రభుత్వాలు అవార్డులిస్తున్నాయంటే తప్పనిసరిగా అందరూ రావాలని, అవార్డుల తేదీ ప్రకటించాక, ఆ తేదీని అందరూ డైరీల్లో నోట్ చేసుకొని, ఆ రోజును అవార్డు కోసమే కేటాయించాలని, ప్రభుత్వం గుర్తించి ఇస్తున్న అవార్డులను జాగ్రత్తగా స్వీకరించాలని దిల్‌రాజు చిత్ర పరిశ్రమకు విజ్ఞప్తి చేశారు. 'గద్దర్ ఫిల్మ్ అవార్డుల వేడుక ఘనంగా జరిగింది. మా ఆరు నెలల కష్టం సఫలమైనందుకు ఆనందంగా ఉంది. వేడుకలో పాల్గొన్న అందరికీ కృతజ్ఞతలు. ఈ వేడుక కోసం 2:15 గంటల విలువైన సమయాన్ని కేటాయించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిగారికి ప్రత్యేక ధన్యవాదాలు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిగార్ల మార్గ నిర్దేశం వల్లనే ఈ వేడుక ఈ స్థాయి సక్సెస్ అయ్యింది. త్వరలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా అవార్డులు ఇవ్వనుంది. ఎక్కడున్నా.. షూటింగులతో బిజీగా ఉన్నా.. ప్రభుత్వం ఇస్తున్న అవార్డులను స్వీకరించేందుకు అందరూ రావాలి. ప్రభుత్వాలతో ప్రయాణించాల్సిన బాధ్యత సినిమా వారందరిదీ.' అంటూ దిల్‌రాజు సూచించారు. ఎఫ్‌డీసీ ఎండీ హరీశ్ ఐఏఎస్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నితిన్ హీరోగా శ్రీరామ్ వేణు దర్శకత్వంలో దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్న ప్రస్టేజియస్ మాస్ ఎంటర్టైనర్ 'తమ్ముడు'. లయ, వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ కీలక పాత్రధారులు. జూలై 4న సినిమా విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా ఆదివారం ఈ సినిమా ఫస్ట్ సింగిల్ అనౌన్స్‌మెంట్‌ని మేకర్స్ విడుదల చేశారు. 'భూ అంటే భూతం..' అంటూ సాగే ఈ పాటను ఈ నెల 17న సాయంత్రం 5 గంటలకు విడుదల చేయబోతున్నట్టు ఆదివారం ఓ ప్రకటన ద్వారా వారు తెలిపారు. తన మేనకోడల్ని ఆడిస్తూ హీరో పాడే ఈ పాట సినిమాకు హైలైట్‌గా నిలుస్తుందని, సంగీత దర్శకుడు అజనీష్ లోకనాథ్ బ్యూటిఫుల్‌గా కంపోజ్ చేయగా, అనురాగ్ కులకర్ణి ఈ పాటను ఆకట్టుకునేలా పాడారని మేకర్స్ తెలిపారు. స్వసిక విజయన్, బేబీ శ్రీరామ్‌దిత్య తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: కేవీ గుహన్, నిర్మాణం: శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్.

గతంలో కంటే ఇప్పుడే బాగున్నా!

కీర్తిప్రతిష్టలకు అతీతంగా.. స్వేచ్ఛగా జీవితాన్ని గడపటమే నిజమైన విజయమని చెప్పింది అగ్ర కథానాయిక సమంత. గత రెండేళ్లుగా తాను నటించిన సినిమాలు రాలేదని, ఈ సంధికాలంలో తానెంతో పరిణితి సాధించానని పేర్కొంది. తాజా ఇంటర్వ్యూలో ఈ భామ పలు ఆసక్తికరమైన విషయాలను వెల్లడించింది. జీవితం తాలూకు ఒకే వృత్తానికి పరిమితం కాకుండా స్వేచ్ఛగా వృద్ధిలోకి రావడం, పరిణితి సాధించడం అన్నింటికంటే ముఖ్యమని చెప్పుకొచ్చింది. 'ఖుషి' తర్వాత సమంత ప్రధాన పాత్రలో నటించిన చిత్రమేది విడుదల కాలేదు. ఆమె నిర్మించిన 'శుభం' చిత్రం ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చిన విషయం తెలిసిందే. ఇందులో సమంత అతిథి పాత్రలో కనిపించింది. ఈ నేపథ్యంలో రెండేళ్ల విరామం తీసుకోవడానికి గల కారణాలను సమంత వివరించింది. ఇప్పుడు నాకు విజయాలు లేవని చాలా మంది భావిస్తున్నారు కావొచ్చు. కానీ గతంలో కంటే ఇప్పుడే నేను బాగున్నా. ప్రతీ రోజు ఉత్సాహంగా నిద్రలేస్తున్నా. జీవితాశయం దిశగా స్పష్టంగా ఆలోచిస్తున్నా. ఓ రకంగా చెప్పాలంటే ఇప్పుడే నేను ఉన్నతమైన విజయాలను ఆస్వాదిస్తున్నా' అని సమంత చెప్పింది. ప్రస్తుతం స్వీయనిర్మాణంలో సమంత 'మా ఇంటి బంగారం' అనే చిత్రంలో నటిస్తున్నది. హిందీలో 'రక్త బ్రహ్మాండ్' సిరీస్‌తో ముందుకురానుంది.

అల్యూమినియం ఫ్యాక్టరీలో ఫైటింగ్

రామ్ పోతినేని నటిస్తున్న మాస్ ఎంటర్టైనర్ 'ఆంధ్రా కింగ్ తాలూకా'. మహేష్ బాబు పి. దర్శకుడు. ప్రతిష్టాత్మక మైత్రీమూవీమేకర్స్ పతాకంపై నవీన్ యర్నేని, వై.రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సూపర్‌స్టార్ సూర్యకుమార్‌గా కన్నడ స్టార్ ఉపేంద్ర ఇందులో ఓ పవర్‌ఫుల్ పాత్ర పోషిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్ అల్యూమినియం ఫ్యాక్టరీలో జరుగుతున్నది. రామ్, ఉపేంద్ర పాల్గొనగా ఈ షెడ్యూల్‌లో కీలకమైన టాకీ పార్ట్‌ని దర్శకుడు మహేష్‌బాబు తెరకెక్కిస్తున్నారు. ఈ సీన్స్ సినిమాలో మేజర్ హైలైట్‌గా ఉండబోతున్నాయని మేకర్స్ చెబుతున్నారు. గ్రేట్ సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చే సినిమాగా ఇది నిలుస్తుందని, ఇప్పటివరకూ చేయని ఒక యూనిక్ క్యారెక్టర్‌ని రామ్ ఇందులో చేస్తున్నారని మేకర్స్ తెలిపారు. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక.

విడుదలకు ముందే ఆడియన్స్‌లో ఆసక్తిని రేకెత్తిస్తున్న సినిమా '8 వసంతాలు'. ఫణీంద్ర నర్సెట్టి దర్శకత్వం వహించిన ఈ కాన్సెప్ట్ ఓరియెంటెడ్ సెంట్రిక్ మూవీలో అనంతిక సనీల్‌కుమార్ లీడ్‌రోల్ పోషించారు. మైత్రీమూవీమేకర్స్ పతాకంపై నవీన్ యర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ నెల 20న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆదివారం థియేట్రికల్ ట్రైలర్‌ని విడుదల చేశారు. 'ఆడవాళ్లు నిప్పు పట్టకూడదు.. అంత్యక్రియలక